

16న భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 9: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం జిల్లా నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు విజయనగరం డిపో మేనేజరు శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న మంగళవారం మధ్యాహ్నం 4.30 గంటలకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు భద్రాచలం చేరుతుందన్నారు. మరిన్ని వివరాలకు 99592 25620, 94943 31213 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సంప్రదాయబద్ధంగా ఉగాది



శ్రీమన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న జేసీ కార్తీక్



చిన్నారికి ఉగాది పచ్చడి రుచి చూపిస్తున్న దృశ్యం

కలెక్టరేట్, ఏప్రిల్ 9: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు జిల్లాలో సందడిగా సాగాయి. సంప్రదాయ వస్త్రధారణతో పిల్లలు, యువకులు, పెద్దలు ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. అనంతరం ఇళ్లలో ఉగాది పచ్చడిని తయారు చేసుకుని ఇరుగుపొరుగు వారికి పంచారు. ప్రధానంగా పంచాంగ శ్రవణాన్ని కూడా ఆసక్తిగా విన్నారు. విజయనగరంలోని శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో మంగళవారం అధికారిక ఉగాది వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా జేసీ కార్తీక్ హాజరయ్యారు. ఆయనకు పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీమన్నార్ రాజగోపాల్ స్వామిని జేసీ దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజారి వారణాశి ధర్మారావు శర్మ పంచాంగ శ్రవణం చేపట్టారు. ఈ ఏడాది ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని, విద్య, వైద్యం, సాంకేతిక, క్రీడా రంగాలు, పర్యాటకం, సంగీతం, సాహిత్యం, కళా రంగాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అనంతరం దేవదాయ శాఖ అధ్వర్యంలో ప్రముఖ అర్చకులు దొంతుకర్త సోమేశ్వర శర్మ(ఎల్.కోట), భద్రం అప్పలచార్యులు(బొబ్బిలి), మురపాక వెంకట శేషుబాబు (జి.అగ్రహారం)లను నగదు పురస్కారం, ప్రశంసా పత్రంతో పాటు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, సీపీవో బాలాజీ, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ జేడీలు విశ్వేశ్వరరావు, తారక రామారావు, మెప్మా పీడీ సుధాకరరావు, మున్సిపల్ సహాయ కమిషనర్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

విజయనగరం రూరల్ : విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పార్టీ జిల్లా కార్యాలయంలో ఉగాది సంబరాలు జరిగాయి. టీడీపీ సీనియర్ అశోక్ గజపతిరాజు, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీలా గజపతిరాజు, అశోక్ సోదరితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈమె స్వయంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. కార్యాలయంలో సందడి వాతావరణం కనిపించింది.



పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. చదురుగుడితో పాటు వనంగుడిలో కూడా పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, అరిసెలు, బూరెలు తదితర పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. కొత్త సంవత్సరం కావడంతో ఎక్కువ మంది భక్తులు పైడిమాంబను దర్శించుకున్నారు. అలాగే నగరంలోని కొత్తపేట సంపత్ వినాయక స్వామి ఆలయం, సిటీబస్టాండ్‌లోని సిద్ధిబుద్ధి వినాయక స్వామి ఆలయం, దాసన్నపేటలోని పెద్ద ఆంజ నేయ స్వామి ఆలయం, కొత్తపేట కుమ్మరవీధిలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.



గజరాయునివలసలో ఉగాది 13న

బాడంగి/ బొబ్బిలి ఏప్రిల్ 9: ఉగాది పండుగను ఏరువాక ముహూర్తం నాడు జరుపుకోవడం ఆ గ్రామంలో ఆనవాయితీ. పూర్వీకుల నుంచి వారు ఇదే సంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు. మంగళవారం గ్రామంలోని శ్రీరామమందిరంలో పురోహితులు పంచాంగపఠనం చేపట్టి శనివారం వేకువజామున 4.05 గంట లకు ఏరువాక ముహూర్తంగా ప్రకటించారు. అందరూ ప్రత్యేకంగా చెప్పుకునే ఆ ఊరు బాడంగి మండలం గజరాయునివలస. ఈ నెల 13న శనివారం ఉగాదిని జరుపుకోనున్నారు. ఆ రోజే పంచాంగ శ్రవణం ఉంటుంది. ఏరువాక కోసం రైతులంతా కొత్త నాగళ్లను తయారు చేసుకునే పనిలో పడ్డారు. ఈ పద్ధతిని దశాబ్దాలుగా పాటిస్తున్నారు. ఉగాది పచ్చడిని ఆ రోజే అందరికీ పంచి పెడతారు. గ్రామదేవత నక్షత్రం ఆధారంగా ఏరువాక ముహూర్తం నిర్ణయిస్తామని గజరాయునివసల గ్రామ పురోహితుడు కె.రామకృష్ణశర్మ తెలిపారు.



రాములమ్మకు 'షాక్'

- ఫ్యాన్.. బల్బుకే

రూ.44,718 బిల్లును చేతిలో పెట్టిన విద్యుత్ సిబ్బంది

నెల్లిమర్ల, ఏప్రిల్ 9: ఆమె నిరుపేద. కేవలం ప్రభుత్వం అందిస్తున్న పింఛనే ఆధారం. కూలి పనిచేసుకునేందుకు సైతం శరీరం సహకరించదు. ఒక ఫ్యాన్, బల్బు తోనే జీవనం సాగిస్తోంది. ఏనాడు విద్యుత్ బిల్లు రూ.200 దాటలేదు. ఈ నెల మాత్రం ఏకంగా రూ.44,718 వచ్చిందని బిల్లు చేతిలో పెట్టి ఆమెకు సిబ్బంది షాక్ ఇచ్చారు. కొండ గుంపాం గ్రామానికి చెందిన సతివాడ రాములమ్మకు ఎదురైన కష్టమిది. బిల్లు చూసి కంగుతిన్న ఆమె సచివాలయానికి వెళ్లగా నెల్లిమర్లలోని విద్యుత్ శాఖ కార్యాల యానికి వెళ్లాలని తిప్పి పంపారు. నెల్లిమర్ల కార్యాలయానికి వెళ్లి మొరపెట్టుకున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆమె భోరున విలపిస్తోంది.




బిల్లు చూపుతూ భోరున విలపిస్తున్న వృద్ధురాలు

నిర్లక్ష్యంతోనే శిథిలం


- విరిగిపడిన బుద్ధుని బోది చెట్టు నమూనా
- ఆలనా పాలనా పట్టించుకోని కార్పొరేషన్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 9: విజయనగరంలోని ప్రధాన జంక్షన్‌లో బుద్ధుని విగ్రహంతో పాటు ప్లాస్టరాఫ్ పారిస్‌తో నిర్మించిన బోదిచెట్టు ఆకర్షణగా కనిపించేది. దానిని జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం చేశారు. నిర్వహణను గాలికివదిలేశారు. ఫలితంగా మంగళవారం విరిగిపడిపోయింది. అటువైపు వెళ్లిన వారంతా చూసి ఆశ్చర్యపోయారు. ధర్మాన్ని పరిరక్షించే బోధకునిగా చెప్పుకునే బుద్ధునికి ఈ దుర్గతి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్ధుని విగ్రహాన్ని టీడీపీ ప్రభుత్వం ఎమ్ఆర్ కళాశాల, గంటస్తంభం కూడలి వద్ద ఏర్పాటు చేసింది. ఈ నమూనా సెట్ చాలా ఆకర్షణీయంగా కనిపించేది. వైసీపీ ప్రభుత్వం నిర్వహణను పూర్తిగా విస్మరించింది. నగర సుందరీకరణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేశామంటున్న ఎమ్మెల్యే కోలగట్ల బుద్ధుని విగ్రహాన్ని కనీసం పట్టించుకోకపోవడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా గౌతమ బుద్ధుని విగ్రహం వద్దనున్న దుస్థితిపై జనవరిలో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. బుద్ధుడిని అవమానించేలా విగ్రహానికి ధూళి పట్టినా, పక్షులు రెట్టలు వేసినా పట్టించుకోవడం లేదని అందులో వివరించింది. అయినా పట్టించుకోలేదు. పూర్తిగా వదిలేసిన కారణంగా మంగళవారం బోది చెట్టు నమూనా భాగం తెగి నేల కూలింది.



ఏదీ చేయూత?

- నేటికీ అకౌంట్‌లో జమ కాని నిధులు
- ఎన్నికల ముందు హడావిడిగా బటన్ నొక్కిన సీఎం
- నెల రోజులుగా మహిళల ఎదురుచూపులు
- వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం పథకానికీ ఇదే దుస్థితి



(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

చేయూత నిధుల కోసం మహిళలు బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. అకౌంట్‌లలో డబ్బులు జమ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. పదేపదే అడుగుతుండడంతో బ్యాంకు సిబ్బంది కూడా విసుక్కుంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ గత నెల 7న వైఎస్ఆర్ చేయూత డబ్బులు విడుదల చేస్తున్నట్లు బటన్ నొక్కారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నిధులు జమ చేస్తున్నట్లు కలెక్టర్ చెక్కును కూడా విడుదల చేశారు. నేటికీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడలేదు. నెల రోజులుగా ఎదురుచూస్తున్న మహిళలు సాయం అందుతుందో.. లేదో అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తున్న నేపథ్యంలో హడావిడిగా మహిళల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు సీఎం బటన్ నొక్కారు.

45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసు మధ్యలో ఉన్న మహిళలకు ఈ సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితుల వల్లే డబ్బులు జమ కావడం ఆలస్యమవుతోంది. ఈసారి అందుతాయో లేదోనని సందేహించాల్సిన దుస్థితి. కొన్నాళ్లుగా అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలదీ అదే పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేయడం.. డబ్బులు జమ చేయడం జరుగుతోంది. కాగా జిల్లా వ్యాప్తంగా 143280మంది లబ్ధిదార్లకు రూ.268.65 కోట్లు జమ చేస్తున్నట్లు కలెక్టర్ మార్చి 7న ప్రకటించారు. ఒక్కో లబ్ధిదారుకు రూ.18,750 జమ కావాల్సి ఉంది. ఈ జాప్యాన్ని కూడా వైసీపీ నేతలు సమర్థించడం గమనార్హం. ఎన్నికల కోడ్ కారణంగానే సకాలంలో అందలేదని, మళ్లీ జగన్ వస్తే ఈ పరిస్థితి ఉండదంటున్నారు. అంటే అప్పు తెచ్చి ఇస్తారన్న విషయాన్ని పరోక్షంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే చేయూత నిధులతో మహిళలు అనేక యూనిట్లు నెలకొల్పినట్లు లెక్కలు చూపుతున్నారు. అందులో చాలామంది గత అనేకేళ్లుగా నిర్వహిస్తున్న చిన్న చిన్న దుకాణాలనే చేయూత నిధులతో ఏర్పాటు చేసినట్లు చూపుతున్నారు. అధికారులూ అవే లెక్కలు వల్లెవేస్తున్నారు. మొత్తంగా ఆసరా ద్వారా 74,111 మంది వివిధ వ్యాపారాలు, యూనిట్లు నెలకొల్పినట్టు చూపుతున్నారు.

ఇదిలా ఉండగా వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం డబ్బులు కూడా జమకాలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమ సామాజిక వర్గాల్లో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళల కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారు. గత నెల 14న సీఎం జగన్ కర్నూలు జిల్లా బలగానపల్లెలో బటన్ నొక్కి విడుదల చేశారు. కానీ నిధులు నేటికీ జమ కాలేదు. వీరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున జమ చేయాల్సి ఉంది. సాయం కోసం వారంతా ఎదురుచూస్తున్నవారు.



వసతి దీవెన అందుతుందా?

- ఫీజుల ఒత్తిడితో టెన్షన్ పడుతున్న విద్యార్థులు

కలెక్టరేట్, ఏప్రిల్ 9: గంట్యాడ మండలం సిరిపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి విజయనగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. విద్యా దీవెన నిధులు జమ కావాల్సి ఉంది. సీఎం బటన్ నొక్కి నెల దాటినా తల్లి అకౌంట్‌లో సాయం పడలేదు. మరోవైపు కళాశాల యాజమాన్యం ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. డబ్బుల్లేక తల్లిదండ్రులు టెన్షన్ పడుతున్నారు. ఇదే సమస్య జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులకు ఎదురవుతోంది.

జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా అక్టోబరు, డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి నిధులను గత నెల ఒకటో తేదీన సీఎం జగన్ కృష్ణా జిల్లాలోని పామర్రులో జరిగిన కార్యక్రమంలో బటన్ నొక్కి విడుదల చేశారు. విద్యార్థుల ఫీజులు చెల్లింపు కోసం జిల్లాలోని 43,209 మంది విద్యార్థులకు ఈ నిధులు మంజూరు చేసినట్లు అధికారులూ ప్రకటించారు. పథకం కింద రూ 30.31 కోట్లు జమ అవుతుందని వెల్లడించారు. 38 రోజులు దాటినా ఇప్పటికీ చాలా మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ కాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒక విద్యా సంవత్సరంలో నాలుగు క్వాటర్లు చొప్పున నిధులను విడుదలు చేస్తారు. ఏపిల్ నుంచి జూన్ వరకూ ఒక క్వాటర్, జూలై నుంచి సెప్టెంబరు వరకూ రెండో క్వాటర్, అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ మూడో క్వాటర్, జనవరి నుంచి మార్చి వరకూ నాలుగో క్వాటర్‌గా నిర్ధారించారు. ఒక్కొక్క క్వాటర్‌కు ఫీజులో నిర్ణయించిన ప్రకారం 25 శాతం నిధులను విడుదల చేయాల్సి ఉంది. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికం నిధులకు బటన్ నొక్కినా అందలేదు. ఇదే విషయాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామనందం వద్ద ప్రస్తావించగా ఈ నిధులు రాష్ట్ర స్థాయి నుంచి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ అవుతాయని, తమ పరిశీలన ప్రకారం జిల్లాలో అందరి అకౌంట్లలో నిధులు జమ అయ్యాయని చెప్పారు.





ఆస్తిపన్నుపై 5 శాతం రిబేటు

విజయనగరం రింగురోడ్డు: ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు పన్ను చెల్లింపులపై ఐదు శాతం రిబేటు సౌకర్యాన్ని కల్పించినట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం .మల్లయ్యానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోగా ముందస్తు చెల్లింపు చేసిన వారికి మాత్రమే ఐదు శాతం రిబేటు అవకాశం ఉందని తెలిపారు. పన్ను చెల్లించడానికి వీలుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. ఈ కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ పని చేస్తాయని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో కాల్ సెంటర్

విజయనగరం రింగురోడ్డు: ప్రజల సౌకర్యార్థం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో కాల్‌సెంటర్‌ను ప్రారంభించినట్టు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ ద్వారా పౌరులకు అందుతున్న సేవల్లో లోపాలు ఉన్నట్టయితే... కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి, త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కాలువల్లో చెత్తాచెదారాలు, వీధి దీపాల సమస్య, పారిశుధ్య సమస్యలను కాల్ సెంటర్ నెంబరు 98499 06486కు ఫోన్ చేయాలని తెలిపారు.

అసమర్థ ఎమ్మెల్యేతో ఇబ్బందులు

బాడంగి: నమ్ముకొని ఓటేసిన బొబ్బిలి నియోజకవర్గ ప్రజలకు ఏ మాత్రం మంచి చేయకుండా ఈ అయిదేళ్లు ముఖం చాటేసిన ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధిచెబుతారని టీడీపీ బీసీ సాధికార కొప్పలవెలమ జిల్లా కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఆయన బాడంగిలో విలేఖర్లతో మాట్లాడుతూ ప్రజలను ఏ మాత్రం పట్టించుకొని ఎమ్మెల్యేని ఈసారి ఓడించడం ఖాయమన్నారు. నియోజకవర్గ పరిధిలో అక్రమ ఇసుక మాఫియా, అక్రమ గ్రావెల్ మాఫియాను పెంచి పోషించారన్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీ

విజయనగరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జనసేన సేవానిధి ఆధ్వర్యంలో విజయనగరం హుకుంపేటలో అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి మంగళవారం నిత్యవసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజు, పాలవలస యశస్విని, పిళ్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్, గాదు అప్పారావు, ఆల్లి బంగారుబాబు, 18వ వార్డు జన సైనికులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బూరాడ జంక్షన్‌లో ఎన్నికల సోదాల్లో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

రేగిడి: బూరాడ జంక్షన్‌లో మంగళవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంట స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.

వెంటాడుతున్న తాగునీటి కష్టాలు

రాజాం: సాంకేతిక లోపంతో రాజాం పురపాలక సంఘ పరిధిలోని ప్రజలకు గత 20 రోజులుగా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గతంలో రోజూ వచ్చే తాగునీటిని ప్రస్తుతం రెండు రోజులకు ఓసారి అందిస్తున్నారు. రేగిడి మండలం సంకిలి సమీపంలో సోర్సు బావులు వద్ద మూడు పంపింగ్ మోటార్లు ఉన్నాయి. అందులో ఒక మోటారు మరమ్మతులకు గురైంది. దీని కారణంగా రాజాం పట్టణ పరిధిలో ఉన్న అమ్మవారి కాలనీలో మూడు ట్యాంకులు. శ్రీకాకుళం రోడ్డులో ఉన్న ఒక ట్యాంకు, డోలపేట, గోపాలపురం, సారధిలో ఉన్న ఒక్కొక్క ట్యాంకులు రెండు పంపుల ద్వారా నిండకపోవడంతో 24వ వార్డులోని ప్రజలకు రోజూ తాగునీరు అందించలేకపోతున్నారు.

త్వరలో మరమ్మతులు చేపడతాం

త్వరలో మోటార్లకు మరమ్మతులు చేపట్టి అన్ని వార్డులకు రోజూ తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటాం. మోటార్ల మరమ్మతులకు విశాఖ నుంచి ఇంజనీరింగ్ సిబ్బందిని రప్పించాం.

-వెంకట్, ఏఈ, పురపాలక సంఘం

కుదమకు 'వాగ్దేవి విద్యాభారతి' పురస్కారం



తిరుమలరావును సత్కరిస్తున్న దృశ్యం

రాజాం: రాజాం రచయితల వేదిక సభ్యుడు కుదమ తిరుమలరావు 'వాగ్దేవి విద్యాభారతి' పురస్కారాన్ని మంగళవారం స్వీకరించారు. విజయనగరం పైడిమాంబ వేద సంస్కృతాంధ్ర సంప్రదాయ పరిరక్షణ సేవా సంఘం, వాగ్దేవి సమారాధనం ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అధ్యక్షతన నిర్వహించిన ఉగాది ఉత్సవాల వేదికపై తిరుమలరావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అడుగడుగునా ట్రాఫిక్

- బొబ్బిలిలో నరకంలా మారిన ప్రయాణం
- ఇరుకైన రోడ్లు, కూడళ్లలో ఇబ్బందులు



బొబ్బిలి గౌడవీధి జంక్షన్‌లో ట్రాఫిక్ దుస్థితి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ అనేది ప్రధాన సమస్యగా మారింది. ప్రతి రోజూ పట్టణంలో ఉన్న అన్ని కూడళ్లలోనూ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కృష్ణాటాకీస్ సెంటరులో శ్వేతాచలపతి, అభ్యుదయ హైస్కూళ్లు ఉన్నాయి. మార్కెట్‌కు వెళ్లేందుకు ఇక్కడ మూడు చిన్న రహదారులు కూడా ఉన్నాయి. దీంతో ఇక్కడ అనునిత్యం ట్రాఫిక్ సమస్య పట్టిపీడిస్తోంది. స్కూళ్లు ఉదయం తెరిచేటప్పుడు, మళ్లీ విడిచిపెట్టిన సమయంలో పిల్లలను తీసుకెళ్లేందుకు వచ్చే తల్లిదండ్రుల వాహనాలతో పాటు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఆ పక్కనే చెత్త కోసం ఏర్పాటు చేసిన పెద్ద డస్ట్‌బిన్, దానిచుట్టూ పేరుకుపోయే చెత్త, స్కూలు బస్సులు ఇతర వాహనాలు, పాదచారులతో ఈ ప్రాంతం కిటకిటలాడుతుంది. ఇరుకైన జంక్షన్ కావడం, నాలుగురోడ్ల కూడలి కావడంతో వాహనాల రాకపోకలకు ఏమాత్రం వీలులేకపోవడంతో ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోతుండడం, నిత్యమూ ఇక్కడ ఎదురయ్యే ప్రధాన సమస్య. ట్రాఫిక్‌ను నియంత్రించే వారెవరూ ఇక్కడ కనిపించకపోవడం మరింత సమస్యగా మారింది.

రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడంతో వాహనాలు కిక్కిరిసిన రహదారిలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గత ప్రభుత్వం కన్నా మిన్నగా తమ ప్రభుత్వ హయాంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ సమస్య లేకుండా చేస్తామని వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. ఫలితంగా పట్టణంలో పలు జంక్షన్లలో ట్రాఫిక్ ఇబ్బందులతో జనం తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోజురోజుకూ జనసంచారం, వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణను పగడ్బందీగా అమలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

టీడీపీతోనే రామరాజ్యం



రేవళ్లపాలెంలో లలితకుమారి ప్రచారం

శృంగవరపుకోట రూరల్/జామి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓటుతో ఇంటికి పంపి.. రామరాజ్యాన్ని రప్పించాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ప్రజలను కోరారు. మంగళవారం రేవళ్లపాలెం, జామి మండల కేంద్రంలోని దొండపర్తిలో ప్రచారం చేశారు. సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ సంతోషి కుమారి, రేవళ్లపాలెం గ్రామపెద్దలు జాగరపు రామకృష్ణ, పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, భీశెట్టి అరుణ, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, బండారు పెదబాబు, వర్రి రమణ, జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుష్ట ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి



కళాను కలిసిన చీపురుపల్లి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

రాజాం: దుష్ట ప్రభుత్వాన్ని తరిమి కొట్టడానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళా వెంకటరావు అన్నారు. మంగళవారం చీపురుపల్లి నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు రాజాం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని కళాకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఎన్నికల సమయంలో కనిపిస్తున్న వైసీపీ నాయకులు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. మంత్రి బొత్స సత్యనారాయణ తోటపల్లి కాలువకు కనీసం రూ.మూడు కోట్లు తెప్పించలేకపోయారని విమర్శించారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేసి తనను గెలిపించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న సూర్య శైలజ

రాజాం రూరల్: మహిళలు అన్నిరంగాల్లో రాణించడం ద్వారా అభివృద్ధి చెందాలని ప్రముఖ గైనకాలజిస్ట్ గార సూర్య శైలజ సూచించారు. ఉగాది పర్వదినం సందర్భంగా వికాస తరంగిణి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. చల్లా మౌనిక, బల్లా మౌనిక, కె.పుష్పలత వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు కైవసం చేసుకున్నారు.

మే 20 నుంచి దారగంగమ్మ పండగ



దారగంగమ్మతల్లి

శృంగవరపుకోట: శృంగవరపుకోటలో కొలువైన శ్రీ దారగంగమ్మ తల్లి పండగను మే 20 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాండవుల చావిడి వద్ద జరిగిన పంచాంగ శ్రవణం సందర్భంగా వేద పండితులు విన్నకోట భాస్కర శర్మ, అనువంశిక పూజారి మోపాడ గౌరినాయుడు ప్రకటించారు. ఈనెల 12న వేకువ జామున 4 గంటలకు ఏరువాక పూజకు ముహూర్తం నిర్ణయించారు. అనంతరం రెండేళ్లకు ఒకసారి ఆనవాయితీగా నిర్వహించే గ్రామదేవత శ్రీదారగంగమ్మ అమ్మవారి పండగను ఈ ఏడాది మే 20 నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. అదే రోజు చాటింపు వేస్తారు. మే 27న తొలేళ్లు, 28న అనుపోత్సవం నిర్వహిస్తారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తి



పిల్లలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయి కల్యాణ్ చక్రవర్తి

విజయనగరం దాసన్నపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలోనూ రాణించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి అన్నారు. కరాటే శిక్షణ పొందుతున్న పిల్లలకు ఉగాది సందర్భంగా ఉచితంగా కరాటే దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రధాన న్యాయాధికారి మాట్లాడుతూ కరాటే లాంటి ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కూరేళ్ల శ్రీనివాస్, ఏటీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ ఎంఎం స్వరూప్, సుమన్ షాటోకన్ అకాడమీ ఉపాధ్యక్షురాలు పింకి అశ్విని, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దండుమారమ్మ ఆలయంలో ఎస్పీ పూజలు



దండుమారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ దంపతులు

విజయనగరం క్రైం, ఏప్రిల్ 9: నగరంలోని కంటోన్మెంట్లోని దేవి దండుమారమ్మ ఆలయంలో జిల్లా ఎస్పీ దీపిక పాటిల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు అమ్మవారి ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం నుంచి వారం రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజున వినాయకపూజ, అన్న సంతర్పణ, చండీహోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులకు పోలీసు అధికారులు సిబ్బంది ఉగాది, దండుమారమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, పార్వతీపురం ఏఆర్ డీఎస్పీ అప్పారావు, విజయనగరం డీఎస్పీ గోవిందరావు, సీఐలు వెంకట్రావు, రామారావు, శ్రీనివాసరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేష్, శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు తాతరాజు, వాసు, శివ, లక్ష్మణ్, బంగారునాయుడు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు



ఉగాది సంబరాలు చేసుకుంటున్న మూడు పార్టీ నాయకులు

రాజాం: స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు, వంగా వెంకటరావు, మరిపి జగన్మోహన్‌రావు, శాసపు రాజేష్ కుమార్, సత్యనారాయణ, బీజేపీ నాయకులు కోటగిరి నారాయణరావు, ఉర్లాపు పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ పండగ



వావిలపాడు ఎడ్ల పరుగు పోటీలో దౌడు తీస్తున్న ఎడ్లబండి

వేపాడ: వావిలపాడు, వేపాడ గ్రామాల ప్రజలు ఉగాది పండగ సందర్భంగా గ్రామ దేవత నూకాలమ్మతల్లి పండగను మంగళవారం నిర్వహించారు. వావిలపాడులో బుధవారం సాయంత్రం ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సంగమేసు (ఫైల్)

సీతానగరం (బలిజిపేట), ఏప్రిల్ 9: లారీ బైక్ ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ పాపారావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెంగాపురం గ్రామానికి చెందిన నక్కాన సంగమేసు (24) అలియాస్ చిన్నా గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉగాది పండగ కోసం అత్తవారింటికి వెళ్లేందుకు బైక్‌పై మిర్తివలస బయలుదేరాడు. మిర్తివలస గ్రామ సమీపానికి వచ్చే సరికి ఎదురుగా బొబ్బిలి వైపు నుంచి బలిజిపేట వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో సంగమేసు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించగా ఆసుపత్రిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు ఉన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీ సీజ్



అదుపులోకి తీసుకున్న జేసీబీ

పాలకొండ: గ్రావెల్ అక్రమ తరలింపును ఇరిగేషన్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మండలంలోని తంపటా పల్లి గ్రామ సమీపంలోని పల్లివానిచెరువు నుంచి అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తుండగా ఇరిగేషన్ అధికారులు దాడులు చేశారు. ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని అదుపులోకి తీసుకుని మైన్స్ అధికారులకు సమాచారం అందించారు. వాహనాలను పాలకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎస్.కోటలో బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాకారులతో కోచ్ శ్రీరాములు

శృంగవరపుకోట: స్థానిక రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ సహకారంతో జూనియర్, సీనియర్స్ సింగిల్స్ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో జె.కుషాల్, అఖిల్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. సీనియర్స్ విభాగంలో బి.హారిక, ఎం.జాన్సన్, ఎం.పూర్ణ చంద్రశేఖర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని చీఫ్ కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



సరసనాపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

రేగిడి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహిస్తున్నారు. మంగళవారం సరసనాపల్లి, కందిశ, తునివాడ, కోడిశ గ్రామాల్లో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవుదళలో వసంత నవరాత్రి మహోత్సవాలు



వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

రేగిడి: దేవుదళలోని శ్రీరామాలయంలో మంగళవారం నుంచి గ్రామస్థులు వసంత నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు సీతారామ కల్యాణ మహోత్సవానికి పందిరి రాట వేశారు. ఆలయ ధర్మకర్త కె.రామకృష్ణారావు, పురోహితులు మావుడూరి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ నెల 17న సీతారామ కళ్యాణం, అన్నదానం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రామస్థులు తెలిపారు.

మద్యం అమ్మకాలపై నిఘా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజాం రూరల్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మద్యం అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎక్సైజ్ సి.ఐ. మురళీధర్ స్పష్టం చేశారు. మద్యం షాపుల్లో ఒకరికి ఒక సీసా మాత్రమే అమ్మేలా ఆదేశాలు జారీ చేశామని వెల్లడించారు. ఈ నెల 7న 'మందుచూపు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు జరిగినా.. తరలించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిషాపు నుంచి రోజుకు 1000 సీసాలు మాత్రమే అమ్మేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. నిబంధనలు అతిక్రమించి షాపుల్లో అమ్మకాలు సాగిస్తే సిబ్బందిపై వేటు తప్పదని సీఐ మురళీధర్ స్పష్టం చేశారు.

బడ్డుకొండను నిలదీసిన గ్రామస్థులు



ఎమ్మెల్యేని ప్రశ్నిస్తున్న మహిళ

పూసపాటిరేగ, ఏప్రిల్ 9: వైసీపీ పార్టీ కార్యక్రమంలో ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడిని స్థానికులు నిలదీశారు. మండలంలో కొత్తకొప్పెర్ల గ్రామంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఇనకోటి పార్వతి అనే మహిళ ఎమ్మెల్యేను నిలదీసింది. ఒక పరిశ్రమలో పనిచేస్తున్న తనని ఆ పరిశ్రమవారు అక్రమంగా తొలగించారని, అయితే ఈవిషయమై స్థానిక నాయకులకు, అదే విధంగా ఎమ్మెల్యేకు విన్నవించుకొన్నా తనకు న్యాయం జరగలేదని ఎమ్మెల్యేను నిలదీసింది. ఈ విధంగా ఎమ్మెల్యే ముందుకు వచ్చి ప్రశ్నించటంతో కార్యకర్తలు, నాయకులు అవాక్కయ్యారు. దీనితో పాటు గ్రామంలో చాలామందికి ఇంటి బిల్లులు అవ్వలేదంటూ ప్రశ్నించారు. ఈ మహిళ నిలదీయటంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆమెను అక్కడి నుండి బలవంతంగా పంపివేశారు.

'ఉపాధి'కి టెంట్ల కొరత

- తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు
- చాలీచాలని సదుపాయాలతో ఉపాధి కూలీల ఇబ్బందులు

రేగిడి: ఉపాధి పనిప్రదేశంలో వేతనదారులకు పూర్తిస్థాయి సౌకర్యాలు అందడం లేదు. వేసవిలో మండటెండల రక్షణకు ప్రభుత్వం టెంట్లు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఈ టెంట్లను గత రెండు మూడేళ్లుగా ప్రభుత్వం అందించడం లేదు.

ఎప్పుడో ఐదేళ్ల క్రితం ఒకసారి ప్రభుత్వం టెంట్లను అందించగా, కాలక్రమంలో ఎండలకు, వర్షాలకు ఇవి చిరిగిపోయాయి. మండలంలో ఈ ఏడాది ప్రస్తుతం 21 పంచాయతీల్లో ఉపాధి పనులు జరుగుతుండగా 4300 మంది వేతనదారులు పనిలో ఉన్నారు. ఈ వారంలో 31 పంచాయతీల్లో 8వేలమంది వేతనదారులను పనిలో దించేందుకు స్థానిక ఉపాధి సిబ్బంది ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది దాదాపు రూ. 26కోట్ల రూపాయలు ఉపాధి పనులు చేసేందుకు యంత్రాంగం కార్యాచరణ తయారుచేసింది. ఈ ఏడాది మండలంలో 100రోజులు పనులు పూర్తయినవారు మినహాయించి ఇంకా 12వేల వరకు జాబ్‌కార్డుదారులు పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అన్నీ బాగున్నా ఈవేసవిలో ఉపాధి వేతన దారులకు చిక్కులు తప్పేలా లేవు. రోజురోజుకూ ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఒకేసారి వేతనదారులు సేదతీరేందుకు పనిప్రదేశంలో సరైన నీడ లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.

పనిప్రదేశంలో తాత్కాలిక షెడ్లు తప్పితే పక్కాగా టెంట్లు ఎక్కడా అందుబాటులో లేవు. ఏర్పాటు చేసిన షెడ్లు కూడా అందరికీ చాలటంలేదని ఉపాధి వేతనదారులు చెబుతున్నారు. గతంలో పని ప్రదేశంలో టెంట్లు సౌకర్యంతో పాటు, మజ్జిగ, ఇతర తాగునీటి వసతి ఉన్నా ఈ ఏడాది తాగునీరు సైతం అంతంత మాత్రమే అన్నఅభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సోమరాజుపేట పాపివానిచెరువు వద్ద షెడ్డులో సేదతీరుతున్న వేతనదారులు

పని ప్రదేశంలో షెడ్లు ఏర్పాటుచేస్తున్నాం

ఉపాధి పనిప్రదేశంలో టెంట్లకు బదులు తాత్కాలిక షెడ్లు అన్ని గ్రామాల్లోనూ ఏర్పాటుచేశాం. టెంట్లు సరఫరా ఈ మధ్య లేకపోవటంతో షెడ్ల ఏర్పాటుకు ఆలోచన చేశాం. ఉపాధి వేతనదారులకు ఇబ్బంది లేకుండా పనిప్రదేశంలో తాగునీరు అందుబాటులో ఉంచుతున్నారం. ఈ వారం వేతనదారుల సంఖ్య రెట్టింపు చేస్తాం.

-హరనాథ్, ఉపాధి ఏపీవో

ప్రమాదకర స్థితిలో వంతెన

- పూర్తి స్థాయిలో లేని రక్షణ గోడలు
- తరచూ ప్రమాదాలు ● చర్యలు తీసుకోని అధికారులు



రక్షణగోడ పూర్తిగా లేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న వంతెన

వీరఘట్టం: మండలంలోని పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారిలోగల చిదిమి జంక్షన్ వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు ఇరు వైపులా పూర్తి స్థాయిలో రక్షణగోడలు లేవు. కొంతవరకు మాత్రమే గోడలు నిర్మించి వదిలేశారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ వంతెన రహదారి మలుపు వద్ద ఉన్న కారణంగా ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంది. దీంతో ఈ దారిలో ప్రయాణానికి వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఇక్కడ కనీసం ప్రమాద సూచిక కూడా ఏర్పాటు చేయలేదు. దీనిపై స్థానికలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా ప్రమాద సూచిక అమర్చడంతో పాటు గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

కురుపాంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

కురుపాం: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, గ్రామస్థులకు మంగళవారం స్థానిక శివ్వన్నపేటలో మసీదు వద్ద మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు షేక్ సాదుల్లా భాషా ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామరాజు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్‌దేవ్, కురుపాం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, నాయకులు డొంకాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి విజయచంద్ర

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: క్రోధినామ సంవత్సరంలో కూటమి విజయమే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్వతీపురంలోని టీడీపీ కార్యాలయంలో విజయచంద్ర ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తనతో పాటు అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీతను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జి.వెంకటనాయుడు, జి.రవికుమార్, బార్నాల సీతారాం, చుక్క జయ ప్రకాష్, జనసేన పార్టీ నాయకుడు చందక అనీల్ తదితరులు పాల్గొన్నారు.

బాబు గెలుపే అందరి లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు

గజపతినగరం: చంద్రబాబు గెలుపే మన అందరి లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డిని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాల పార్టీ అధ్యక్షులు ఎ.లక్ష్మనాయుడు, కోరాడ కృష్ణ, కొండపల్లి భాస్కరనాయుడు, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మూర్తిరాజు సేవలు చిరస్మరణీయం



మూర్తిరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల: మిమ్స్ వైద్య కళాశాల వ్యవస్థాపకుడు, దివంగత అల్లూరి మూర్తిరాజు విద్యాపరంగా చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ వైద్య కళాశాల చైర్మన్, మూర్తిరాజు కుమారుడు అల్లూరి సత్యనారాయణరాజు (బాబీ) అన్నారు. స్వర్గీయ మూర్తిరాజు జయంతి వేడుకలను మిమ్స్ క్యాంపస్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చైర్మన్‌తో పాటు మేనల్లుడు వర్మరాజు, ఉన్నత స్థాయి యాజమాన్య ప్రతినిధులు.. మూర్తి రాజు సమాధిని సందర్శించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

షిరిడీసాయి మందిరంలో భగవద్గీత పారాయణం



ప్రసంగిస్తున్న రామ్మోహనరావు

పార్వతీపురంటౌన్: మానవ జీవితానికి భగవద్గీత దిక్సూచి వంటిదని ప్రముఖ హిందూ ధర్మ ప్రచారకుడు కె.రామ్మోహనరావు అన్నారు. మంగళవారం స్థానిక బైపాస్ రహదారిలోగల శ్రీషిరిడీసాయి మందిరంలో భగవద్గీత పారాయణం ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సత్సంగంలో ఆయన ప్రసంగించారు. అనంతరం మందిరంలో ఉగాది సంబరాలను నిర్వహించారు.

విద్యుత్ తీగలకు ఆనుకుని..

- ప్రమాదకరంగా భవన నిర్మాణాలు



విద్యుత్ తీగలకు తాకేలా కర్రల నిచ్చెన ఏర్పాటుచేసిన దృశ్యం

వీరఘట్టం: వీరఘట్టం మెయిన్‌రోడ్డులో గృహాల సిమెంట్ పనుల్లో భాగంగా విద్యుత్ తీగలకు ఆనుకుని కర్రలతో నిచ్చెన ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిచ్చెన పైన నిల్చొని ఇంటి పనులు చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉండడంతో ఏ క్షణంలోనైనా విద్యుత్ ప్రమాదం జరుగుతుందని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రజల్లో అవగాహన చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

యాప్‌లతో అపసోపాలు

- అంగన్‌వాడీ సిబ్బందికి తప్పని తిప్పలు



అంగన్‌వాడీలో చిన్నారులు (ఫైల్)

దత్తిరాజేరు: అంగన్‌వాడీ సిబ్బందిని యాప్‌ల సమస్య వెంటాడుతోంది. ప్రభుత్వం అందించిన సెల్‌ఫోన్‌లలో యాప్‌ల ద్వారా వివరాల నమోదుకు నానా తిప్పలు పడుతున్నారు. ఒక వైపు కేంద్రాల నిర్వహణ, మరోవైపు యాప్‌లలో వివరాల నమోదుతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ యాప్‌ల నమోదు కారణంగా గంటల తరబడి సమయం వృథా అవుతోందని పలువురు సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికే ఉన్న యాప్‌ల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వివరాల నమోదు చేస్తున్నామని, కొత్తగా ఫ్యామిలీ సర్వే యాప్‌ను చేర్చడంతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి పోషణ ట్రాకర్, సంపూర్ణ పోషణ యాప్‌లలో ఇప్పటికే పలు రకాల వివరాలు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఈ యాప్‌ల ద్వారా ఆరు నెలల నుంచి మూడేళ్ల వయస్సు ఉన్న చిన్నారుల వివరాలు, బాలామృతం, పాలు, గుడ్లు తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. వీటితోపాటు ప్రీస్కూల్ హాజరు, ఆరేళ్లలోపు పిల్లల బరువు, ఇతర వివరాలు పొందుపరుస్తున్నామని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఫ్యామిలీ సర్వే యాప్‌ను చేర్చడంతో ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. ఉదయం నుంచి యాప్‌లతోనే సమయం వృథా అవుతోందని, కేంద్రంలో రోజువారీ ఇతర విధులు ఎప్పుడు నిర్వహించాలని కొంతమంది సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఇబ్బందులు ఇవీ...

పోషణ ట్రాకర్, సంపూర్ణ పోషణ యాప్‌లలో ఆన్‌లైన్ వివరాలు నమోదు చేసేందుకు సుమారు 2 గంటల సమయం పడుతోందని, ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి సుమారు 15 నుంచి 20 మంది చిన్నారులు హాజరవుతారని, వీరితోపాటు గర్భిణులు, బాలింతలు కూడా 15 నుంచి 20 మంది కేంద్రానికి వస్తుంటారని, నెలకు నాలుగుసార్లు గుడ్లు, బాలమృతం, పౌష్టికాహారం వంటివి ఈ యాప్‌లలో నమోదు చేయాలి. ప్రతినెలా 1 నుంచి పదో తేదీలోగా ఆరేళ్లలోపు పిల్లల ఎత్తు, బరువు కొలిచి వారి చిత్రాలను యాప్‌లలో అప్‌లోడ్ చేయాలి. కొత్తగా ఫ్యామిలీ సర్వే యాప్‌లలో 35 నుంచి 40 వరకు కోలమ్స్ ఉండడంతో వీటిని నమోదు చేయాలంటే చాలా సమయం పడుతుందని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెట్‌వర్కు అంతంత మాత్రమే..

కొన్ని గ్రామీణ ప్రాంతాలు కావడంతో నెట్‌వర్కు పనిచేయక సకాలంలో యాప్‌లలో వివరాలు నమోదు చేయలేకపోతున్నామని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం సమకూర్చిన సెల్‌ఫోన్లు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయని, ఒక్కోసారి హ్యాంగ్ అవుతున్నాయని వాపోతున్నారు. గత్యంతరం లేక సొంత సెల్‌ఫోన్లు ఉపయోగించాల్సి వస్తోందని అంటున్నారు. యాప్‌లలో వివరాల నమోదు ఆలస్యమైతే పనివేళలు ముగిసాక సంబంధిత ఐసీడీఎస్ కార్యాలయాలకు వెళ్లి పని పూర్తిచేయాల్సి వస్తోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యాప్‌ల భారం తగ్గించాలని సిబ్బంది కోరుతున్నారు.

వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు



సాలూరు రూరల్: ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో మహిళల కోలాటం



నెల్లిమర్ల: పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



గరుగుబిల్లి: కోదండరామస్వామి ఆలయంలో పూజలు

సాలూరు రూరల్: సాలూరులో ఈనెల 17వరకు నిర్వహించనున్న శ్రీరామ వసంత నవరాత్రి ఉత్సవాలు ఉగాది సందర్భంగా మంగళవారం ప్రారంభమయ్యాయి. సాలూరు డబ్బివీధి రామమందిరం, పెదకోమటిపేట రామాలయం, వెలమపేట నవోదయ సేవా సమితి తదితర చోట్ల శ్రీరామ నవమి వేడుకలకు శ్రీకారం చుట్టారు. వెలమపేట, డబ్బి వీధి, మెంటాడ వీధులకు చెందిన సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. ఈ తిరువీధిలో శ్రీకృష్ణసఖి బృందం మహిళా నృత్యార్చన కార్యక్రమం అలరించింది. ● మామిడిపల్లి శ్రీరామమందిరంలో శ్రీరామ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు సీతారాముల విగ్రహాలను ధాన్యం బుట్టలో ఉంచి ఊరేగించారు. సుహాసిని (కన్యలు) పూర్ణకుంభ ఘటాలతో ఈ ఊరేగింపు నిర్వహించారు. విగ్రహాలను రామమందిరంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.

రామతీర్థం ఆలయంలో..

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. శ్రీరామచంద్రస్వామి సన్నిధిలో ఉదయం ప్రాతఃకాలార్చన, బాలభోగం అనంతరం శ్రీరామచంద్రస్వామిని ఆస్థాన మండపంలో వేంచేసి విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం శ్రీమద్రామాయణం పారాయణ, సుందరకాండ పారాయణ దివ్య ప్రబంధ సేవా కాలాలు నిర్వహించారు. యాగశాలలో సుందర కాండ పారాయణ హవనం, ఆదిత్య హృదయం నిర్వహించారు. సాయంత్రం నారాయణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ పూజలు నిర్వహించారు.

తోటపల్లి కోదండ రామాలయంలో..

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో మంగళవారం వసంత నవరాత్రి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో మొదటి రోజున శ్రీరామ సుప్రభాత సేవ, ఆరాధన, మంగళా శాసనం, శ్రీవిష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, రుత్విక్ వరుణ, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, తదితర పూజలు నిర్వహించారు. ఈనెల 17న శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీసీతారామస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు తెలిపారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా ఉగాది వేడుకలు



కురుపాం: బాబాకు పూజలు



కురుపాం రూరల్: మొండెంఖల్‌లో పంచాంగ శ్రవణం



గజపతినగరం: అభయాంజనేయస్వామి ఆలయంలో..

కురుపాం: ఉగాది సందర్భంగా కురుపాంలోని పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. నూతన తెలుగు సంవత్సరం ప్రారంభోత్సవం సందర్భంగా ఉగాది పచ్చడి చేసి, రుచి చూశారు. వ్యాపారులు కొత్త పుస్తకాలు ప్రారంభించారు. రైతులు ఏరువాక నిర్వహించారు. బంగారం, పసుపు, బెల్లం వంటి వస్తువులు కొనుగోలు చేశారు. అలాగే సాయంత్రం పంచాంగ పఠనం చేశారు. ఈసందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● **కురుపాం రూరల్:** క్రోధి నామ ఉగాది నూతన సంవత్సరాన్ని మండల ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో భక్తులు పోటెత్తారు. మొండెంఖల్‌లోని శ్రీవైభవ వేంకటేశ్వర ఆలయంలో ప్రధాన పూజారి బాలకృష్ణ మిశ్రో పంచాంగ శ్రవణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ● **గజపతినగరం:** స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా పంచంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పంచగ శ్రవణం చదివి వినిపించారు. అలాగే స్థానిక సీతారామస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శ్రీరామ్ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ● **జామి:** క్రోధినామ సంవత్సరం తమలో ఉన్న కోపాన్ని, ద్వేషాన్ని జయించి సహనంతో ముందుకు సాగాలని చెబుతుందని వేదపండితుడు ఏఎస్ శర్మ తెలిపారు. మంగళవారం కుమరాం గ్రామంలో ఆయన పంచాగ శ్రవణం నిర్వహించారు. ● **బొబ్బిలి:** బొబ్బిలి శ్రీకళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేమకోటి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ నరసింహస్వామికి పూజలు చేశారు. పంచాంగ పఠనం చేశారు. పోతుల సోమరాజు జ్ఞాపకార్థం పేద కళాకారులకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి చేతులమీదుగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. శ్రీకళాభారతి ప్రతినిధుల ఆధ్వర్యంలో కళాకారులు పలు ప్రదర్శనలు చేశారు. ● **రాజాం:** నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలకు టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ శ్రీక్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చే విధంగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. ● **వేపాడ:** ఉగాది పండగను మండలవాసులు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని బొద్దాం, వేపాడ, వల్లంపూడి, సోంపురం, వావిలపాడు తదితర గ్రామాల ప్రజలు గ్రామ దేవత నూకాలమ్మతల్లి అమ్మవారి పండగను నిర్వహించారు.

తెలుగు పద్యాల పోటీ

పాలకొండ: పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీసూర్యచంద్ర కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బౌరోతు శంకరరావు అధ్యక్షతన వేమన సుమతీ శతక పద్యాల పోటీలు ఘనంగా మంగళవారం నిర్వహించారు. విజేతలకు నగదు పారితోషకాన్ని వావిలపల్లి గోవిందరావు సౌజన్యంతో అందించారు. కవిగాయక సమ్మేళనంలో పలువురు పాల్గొని కవితలు వినిపించారు. కవితాగానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



పాలకొండ: పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



జామి: కుమరాంలో పంచాగ శ్రవణం



బొబ్బిలి: రాజచెరువువలసలో..



వేపాడ: పంచాంగ శ్రవణం

వాసవీ మాతకు బంగారు, వెండి చీరలు



బంగారు చీరతో వాసవీ మాత

సాలూరు రూరల్: క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా సాలూరు వాసవీ మాతకు బంగారు, వెండి చీరలతో మంగళవారం అలంకరించారు. కిలోన్నర బంగారంతో దాతల సహకారంతో చీర చేయించారు. మూడు కిలోల వెండి చీరను సుతాపల్లి వీరవెంకటరావు, రమ దంపతుల అమ్మవారికి చేయించారు. రెండు చీరలను అమ్మవారికి తెలుగు నూతన సంవత్సరంగా అలకరించడంతో భక్తులు దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

నెల్లిమర్ల: జగ్గరాజుపేట గ్రామంలో కోడిపందాలు ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను మంగళవారం నెల్లిమర్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,510, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామగణేష్ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

నిరుపయోగంగా ఉద్యానవనం

- గత కొన్నేళ్లుగా వినియోగంలో లేని రైల్వే పార్కు
- మౌలిక సదుపాయాలు లేవు.. రక్షణ కరువు
- ఆటపాటలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కోరుతున్న స్థానికులు



రైల్వే కాలనీలో మౌలిక సదుపాయాలు లేక వెలవెలబోతున్న పార్కు



వృథాగా ఉన్న ఆటవస్తువులు

గజపతినగరం: స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే శాఖ ఏర్పాటుచేసిన చిన్నపిల్లల పార్కుకు తగిన రక్షణ లేకపోవడంతో వెలవెలబోతోంది. రైల్వేశాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల పిల్లలతోపాటు ప్రయాణాలు చేసే వృద్ధులు, వారి పిల్లలు సేదతీర్చుకోవడంతో పాటు ఆటపాటలకు అనుగుణంగా ఈ పార్కును తీర్చి దిద్దారు. అయితే సంబంధిత అధికారులు పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పిల్లలు ఎవరూ అటువైపు చూడడం లేదు. 2017 ఫిబ్రవరి 17న రైల్వే జనరల్ మేనేజర్ ఉమేష్‌సింగ్ దీనిని ప్రారంభించారు. పార్కు కొన్నాళ్ల పిల్లలతో సందడిగా ఉండేది. కాలక్రమేణా దీన్ని అధికారులు పట్టించుకోవడం మానేశారు. వేసవి వచ్చిందంటే పిల్లలకు ఆట విడుపుగా ఉండేది. ఉదయం, సాయంత్రం పిల్లలు పార్కుకు వచ్చి ఆట పాటలతో అలరించేవారు. ప్రస్తుతం వేసవి వచ్చినా పిల్లలు అటు వైపు కన్నెత్తి చూడడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించి, పిల్లల ఆట పాటలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని స్థానికులతో పాటు ఉద్యోగులు కోరుతున్నారు.